ఘనపూర్ ఆనకట్టకు చేరుకున్న సింగూరు నీరు

ఘనపూర్ ప్రాజెక్ట్‌కు చేరుకున్న నీళ్లు

పాపన్నపేట, జనవరి 16 : సింగూరు జలాశయం నుంచి వదిలిన నీరు ఘనపూర్ ప్రాజెక్ట్‌కు చేరుకున్నది. ఈ నెల 12న సింగూరు ప్రాజెక్ట్ జల విద్యుత్ కేంద్రం నుంచి 2.667 క్యూసెక్కుల నీటిని ఆనకట్టకు వదలగా, 15వ తేదీ నాటికి వనదుర్గా ప్రాజెక్టుకు చేరుకోవడం ప్రారంభమైంది. మంగళవారం వేకువ జామున సుమారు 5 ఫీట్ల మేర నీరు చేరుకున్నది. దీంతో పాపన్నపేట మండలాల కింద వేలాది ఎకరాల పంట పొలాలకు సాగు నీరు అందనున్నది. ఆనకట్టకు నీరు చేరడంతో రైతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అభివృద్ధి ప్రణాళికలు తయారు చేయాలి

మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

మెదక్, జనవరి 16 (నమస్తే తెలంగాణ) : గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేయాలని జీపీడీపీ సమావేశంలో కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా పంచాయతీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశానికి గ్రామాలే పట్టుకొమ్మలని, గ్రామాన్ని అభివృద్ధి చేసుకుంటే, దేశాన్ని అభివృద్ధి చేసుకున్నట్లు అని అన్నారు. జనవరి 31 లోపు గ్రామ పంచాయతీ డెవలప్‌మెంట్ ప్రణాళికలు తయారు చేసుకోవాలని సూచించారు. జీపీడీపీ ప్లాన్‌లు చేసి ఈ-గ్రామ్ స్వరాజ్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. అదనపు కలెక్టర్ రమేశ్, డీపీవో సాయిబాబా, డీఆర్డీవో శ్రీనివాస్, జడ్పీ సీఈవో శైలేశ్ తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో సామూహిక నోములు



పెద్దశంకరంపేట శివాలయంలో సామూహిక నోముల్లో పాల్గొన్న మహిళలు

పెద్దశంకరంపేటలో నోములు నోముకుంటున్న ఆర్యవైశ్య మహిళలు

పెద్దశంకరంపేట, జనవరి 16 : సంక్రాంతిని పురస్కరించుకొని పెద్దశంకరంపేటలోని ద్వాదశ జ్యోతిర్లింగ శివాలయంలో ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో మహిళలు మహాన్యాస పూర్వక ఏకరుద్రాభిషేకం, లక్ష పుష్పార్చన, గణపతిపూజ, ఏకదశ రుద్రాభిషేకం, బిల్వార్చన, తదితర పూజలు వేదబ్రాహ్మణ పండితుల మంత్రోచ్ఛరణల మధ్య వైభవంగా నిర్వహించారు. సంక్రాంతి సందర్భంగా అన్ని గ్రామాల్లో మహిళలు ఇంటి వాకిళ్లను ముగ్గులతో అందంగా అలంకరించి సంబురపడ్డారు. కార్యక్రమంలో ఎంపీపీ జంగం శ్రీనివాస్, వైస్ ఎంపీపీ లక్ష్మి, మహిళా ఆర్యవైశ్యసంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాగం అర్చన, చకిలం విశాల ఉన్నారు.

అయోధ్య రాముడి క్యాలెండర్ ఆవిష్కరణ



పెద్దశంకరంపేటలో క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంపీపీ, ప్రజాప్రతినిధులు

పెద్దశంకరంపేట, జనవరి 16 : అయోధ్య శ్రీ రాముడి పట్టాభిషేక క్యాలెండర్‌ను మంగళవారం శ్రీసరస్వతీ శిశుమందిరంలో ఎంపీపీ జంగం శ్రీనివాస్ ఆవిష్కరించారు. అయోధ్యలో 22న శ్రీ రాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ జరుగుతుందన్నారు. పెద్దశంకరంపేటలో రామాలయం కేంద్రంగా ఈ యొక్క కార్యక్రమాన్ని అందరూ వీక్షించాలని పేర్కొన్నారు. ఆర్ఎస్ఎస్ జిల్లా కార్యవాహ ఓంకార్, ఎంపీటీసీ వీణా సుభాష్‌గౌడ్, ప్రధానాచార్యులు వీరప్ప, బాధ్యులు జంగం రాఘవులు, క్రాంతిలాల్, పున్నయ్య,సీతారామరావు, రవివర్మ, సర్వేశ్వర్, సతీష్‌గౌడ్, మధు, శ్రీకాంత్, శ్రవణ్, సంతోష్‌కుమార్ ఉన్నారు.

మహిళా ఓటర్లకు బహుమతులు

రామాయంపేట, జనవరి 16 : 11వ వార్డులో మహిళలకు కౌన్సిలర్ సంక్రాంతి సందర్భంగా మంగళవారం బహుమతి అందజేశారు. వార్డులో ఉన్న 400 మంది మహిళా ఓటర్లకు డ్రా సిస్టమ్ పెట్టారు. సోమవారం ఈ డ్రా సిస్టంలో 400 కూపన్లు కలిగిన బహుమతులను కూపన్‌లపై బహుమతి పేరును రాసి పెట్టి వార్డుకు చెందిన మహిళలు డ్రాలో నుంచి కూపన్ తీస్తే వారి కూపన్‌పై ఉన్న బహుమతిని అందజేశారు. ఇలా 400 మంది మహిళలకు ఫ్రిడ్జ్ , టీవీలు, కూలర్స్ తదితర లక్కి డ్రా నిర్వహించి అందజేశారు.



మహిళలకు బహుమతి అందజేస్తున్న కౌన్సిలర్ గంగాధర్

ఊరూరా సంక్రాంతి సంబురాలు

సంక్రాంతి సంబురాలు మెదక్ జిల్లా వ్యాప్తంగా అంబరాన్నంటాయి. రంగవల్లులతో వాకిళ్లన్నీ పులకరించగా, పసుపు కుంకుమతో పులుముకున్న గొబ్బెమ్మలు ఎంతో ముచ్చట గొలిపాయి. సకల సౌభాగ్యాలు కలగాలని నోచే నోములు, తీరొక్క బొమ్మల కొలువులతో ఇంటింటా సందడి నెలకొన్నది. గంగిరెద్దుల విన్యాసాలు, ఆకాశాన పతంగుల విహారాలు ఆకట్టుకున్నాయి.

-మెదక్ నెట్‌వర్క్, జనవరి 16

చేగుంట: గాలిపటాలతో ఎంపీపీ మాసుల శ్రీనివాస్, తదితరులు

మెదక్‌లో ముగ్గులు వేస్తున్న యువతులు

చేగుంట: కర్నాల్‌పల్లిలో..

చిన్నశంకరంపేట: ముగ్గుల విజేతకు బహుమతి

మెదక్‌లో ముగ్గులు వేస్తున్న మహిళలు

మెదక్ మున్సిపాలిటీ: రంగులు నింపుతున్న మహిళ

మెదక్‌లో అయోధ్య ముగ్గు

శివ్వంపేట: గూడురులో ముగ్గుల పోటీలు

అల్లాదుర్గం: ముగ్గులు వేస్తున్న చిన్నారులు

మెదక్‌లో ముగ్గులు వేస్తున్న మహిళలు

మెదక్ మున్సిపాలిటీ: చిన్నారులతో మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్

శివ్వంపేట: సంక్రాంతి వేళ గోమారం ప్రజలతో ఎమ్మెల్యే సునీతారెడ్డి

అల్లాదుర్గం: ముగ్గులు వేస్తున్న మహిళలు

బీఆర్ఎస్ నాయకుడి హఠాన్మరణం

నారాయణ(ఫైల్)

రామాయంపేట, జనవరి 16 : రామాయంపేట మండలం దంతెపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు హఠాన్మరణం చెందిన సంఘటన సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. బాధిత కుటంబీకుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గొల్ల నారాయణ (55) రాత్రి అన్నం తిని పడుకున్న వ్యక్తి తెల్లవారి చూసేసరికి శవమై కనిపించాడని కుటుంబీకులు బోరుమన్నారు. మృతుడు నారాయణ గత ఐదేండ్ల కింద భార్యను సర్పంచ్‌గా గెలిపించి దంతెపల్లి గ్రామానికి సేవలు అందించాడు. కుటుంబ పెద్ద మృతి చెందడంతో కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు సర్పంచ్ సురేశ్, ఎంపీటీసీ బుజ్జి, దేవేందర్, వార్డు సభ్యులు, ఇతర గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ విషయమై మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డికి తెలియడంతో అంత్యక్రియల నిమిత్తం బాధిత కుటుంబానికి రూ.20వేల ఆర్థిక సహాయాన్ని బీఆర్ఎస్ నాయకుల ద్వారా అందజేశారు.

చైనా మాంజతో యువకుడికి గాయం

రామాయంపేట, జనవరి 16 : చైనా మాంజ యువకుడి గొంతుకు తగిలి తీవ్ర గాయమైన సంఘటన రామాయంపేట పట్టణంలోని సోమవారం చోటుచేసుకుంది. వివరాలలోకి వెళితే.. నిజాంపేట మండల కేంద్రానికి చెందిన యువకుడు దండు మహేందర్ తన బైక్‌పై నిజాంపేట నుంచి రామాయంపేటకు వెళ్తున్నాడు. మార్గమధ్యలో మల్లె చెరువు ప్రాంతంలో బైక్ నడిపిస్తున్న యువకుడి గొంతుకు పతంగికి ఉన్న చైనా మాంజ తగిలి తీవ్ర రక్తస్రావమైంది. యువకుడిని వెంటనే అక్కడకు చేరుకున్న స్థానికులు 108 అంబులెన్స్‌లో రామాయంపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మంగళవారం యువకుడికి వైద్యం నిర్వహించిన వైద్యులు ఇంటికి తరలించారు.

చికిత్స పొందుతున్న యువకుడు

స్నేహితుడికి ఆర్థికసాయం

రామాయంపేట, జనవరి 16 : పూర్వ స్నేహితుడికి అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు ఆర్థిక సాయం అంద జేశారు. మంగళవారం రామాయంపేట పట్టణానికి చెందిన సందీప్ కుటుంబానికి అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు రూ.6 వేల నగదు అందజేశారు. బాధితుడు గతేడాది విద్యుత్ ప్రమాదంలో కాళ్లు చేతులు చచ్చుబడి పోయి నడవలేని స్థితిలో ఉన్న స్నేహితుడికి సాయం అందజేశారు.

అంత్యక్రియలకు..

నిజాంపేట, జనవరి 16 : మండలంలోని కల్వకుంట గ్రామానికి చెందిన బాల్ రెడ్డి (78) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు.స్థానిక నేతల ద్వారా తెలుసుకున్న మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు రూ. 5వేలు ఆర్థిక సాయాన్ని పంపించగా, రవీందర్‌రెడ్డి, మహేందర్‌రెడి అందజేశారు. పరామర్శించిన వారిలో స్థానికులు మసూద్, రమేశ్, మోహన్‌రెడ్డి, సుధాకర్ రెడ్డి, నర్సింహారెడ్డి తదితరులు ఉన్నారు.

కోతుల దాడిలో వ్యక్తికి గాయాలు

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 16 : కోతుల దాడిలో వ్యక్తికి గాయాలైన ఘటన మెదక్ పట్టణంలోని నవాబుపేట వీధిలో చోటు చేసుకున్నది. వివరాల్లోకి వెళితే.. నవాబుపేట వీధికి చెందిన బీఆర్ఎస్ నేత బాలరాజు సోమవారం ఉదయం ఇంటి ముదు నిలిచి ఉం డగా, కోతుల మంద ఒకేసారి వచ్చి దాడి చేశాయి. కోతులను తరమడంతో బాలరాజు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. వెంటనే బాలరాజును ప్రభుత్వ దవాఖానకు తరలించి ప్రాథమిక చికిత్స అందజేశారు. పట్టణంలో కోతుల బెడద ఎక్కువగా ఉందని, వెంటనే ఇక్కడి నుంచి తరలించాలని పలువురు పట్టణ వాసులు మున్సిపల్ అధికారులకు విజ్ఞప్తి చేశారు.

అదృశ్యమైన వ్యక్తి చెరువులో శవమై..

ఎండీ సిద్దిఖీ(ఫైల్)

రామాయంపేట, జనవరి 16 : రెండు రోజుల కింద అదృశ్యమైన వ్యక్తి చెరువులో మృతదేహం కనిపించిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. రామాయంపేట ఎస్సై రంజిత్ కథనం ప్రకారం.. పట్టణంలోని దుర్గమ్మ బస్తీకి చెందిన ఎండీ సిద్దిఖీ (50) రెండు రోజుల కింద ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. కుటుంబీకులు వారి బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. మంగళవారం సిద్దిఖీ మృతదేహం పట్టణంలోని మల్లె చెరువులో కనిపించినట్లు స్థానికులు సమాచార మిచ్చారు. మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టన్ నిమిత్తం రామాయంపేట ప్రభుత్వ దవాఖాన మార్చురీకి తరలించి, కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

యువత అన్నిరంగాల్లో ముందుండాలి

విజేతగా నిలిచిన జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న కౌన్సిలర్ అనిల్‌కుమార్

మెదక్, జనవరి 16 (నమస్తే తెలంగాణ) : హౌసింగ్ బోర్డులోని క్రీడాకారుల్లోని ప్రతిభ వెలికితీసేందుకే హౌసింగ్ బోర్డు ప్రీమియర్ లీగ్ (హెచ్‌పీఎల్) సీజన్-3 నిర్వహించినట్లు కాంగ్రెస్ నాయకులు, హరితమిత్ర అవార్డు గ్రహిత, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ తిమ్మన్నగారి అనిల్‌కుమార్ అన్నారు. మంగళవారం బహుమతుల ప్రదానోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని, ప్రతి క్రీడాకారుడు క్రీడాస్ఫూర్తితో ఆడాలన్నారు.

హోరా హోరీగా ఫైనల్..

హౌసింగ్ బోర్డు ప్రీమియర్ లీగ్ ఫైనల్ మ్యాచ్ క్రియేస్ హంటర్స్ -ఆస్ట్రెండ్ ఈగల్స్ మధ్య హోరా హోరీగా సాగింది. టాస్ గెలించి ముందుగా బ్యాటింగ్ ప్రారంభించిన క్రియేస్ హంటర్స్ నిర్ణీత 10 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 80 రన్స్ చేసింది. 81 పరుగుల లక్ష్యంతో దిగిన ఆస్ట్రెండ్ ఈగల్స్ 9 ఓవర్ల లోనే 2 వికెట్లు మాత్రమే కోల్పోయి 83 పరుగులతో విజయం సాధించింది. ఈ జట్టుకు ట్రోఫీతోపాటు నగదు అదించారు.

అయ్యప్ప ఆలయ అభివృద్ధికి కృషి

ఆలయ అభివృద్ధిపై చర్చిస్తున్న నూతన కమిటీ సభ్యులు

రామాయంపేట, జనవరి 16 : అయ్యప్ప ఆలయ అభివృద్ధికి కృషిచేస్తానని ఆలయ నిర్వాహకుడు, నూతన కమిటీ చైర్మన్, మున్సిపల్ చైర్మన్ పల్లె జితేందర్‌గౌడ్ అన్నారు. మంగళవారం అయ్యప్ప ఆలయంలో స్వాముల సమక్షంలో నూతన కమిటీని ఏర్పాటు చేశారు. చైర్మన్‌గా ఆలయ నిర్వాహకుడు పల్లె జితేందర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా మర్కు నగేశ్, కోశాధికారిగా చింత రాజు,ఉపాధ్యక్షుడిగా పటేరి రాము, పడాల శివప్రసాద్‌రావు, కార్యదర్శిగా దోమకొండ శ్రీనువాస్, చిన్న శ్రీనువాస్, కిరణ్, పీఆర్వీగా బొందుగుల రాజు, వినోద్‌కుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

వైభవంగా రేణుకామాతకు అభిషేకం

కొల్చారం మండల కేంద్రంలోని శ్రీ రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో మంగళవారం కొల్చారం ఎంపీటీసీ పాల్వంచ అరుణ, కృష్ణగౌడ్ దంపతులు అభిషేకం, అలంకరణ, అర్చన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించారు. వైదపండితులు చల్లూరి కృష్ణశర్మ, సాగరిక పాల్గొన్నారు.

-కొల్చారం, జనవరి 16

కేజ్‌వీల్స్‌తో రోడ్లపైకి వస్తే కఠిన చర్యలు

మెదక్ అర్బన్, జనవరి16 : ట్రాక్టర్‌లను కేజ్‌వీల్స్‌తో బీటీ రోడ్లు, సీసీరోడ్లపై నడపడం వల్ల రోడ్డు డ్యామేజీ అవుతాయని అలా ట్రాక్టర్లను కేజ్‌వీల్స్‌తో బీటీరోడ్డు సీసీరోడ్లపై నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మెదక్ ఎస్పీ డాక్టర్ బాలస్వామి అన్నారు. కేజ్‌వీల్స్‌తో రోడ్లపైకి వచ్చే ట్రాక్టర్ యజమానులపై మోటరు వాహన చట్టం ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నిందితుడికి రిమాండ్

పాపన్నపేట/కొల్చారం, జనవరి 16 : ఆలయాల్లో దొంగతనాలు చేస్తున్న పాత నేరస్తుడు వడ్డే దుర్గేశ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ ఫణీదర్ వెల్లడించారు. మండల పరిధిలోని ఎల్లంపల్లి గ్రామానికి చెందిన వడ్డే దుర్గేశ్ మూడు నెలల నుంచి దేవాలయాల్లో గుడి తలుపులు పగల కొట్టి హుండీ, సీసీ కెమెరాలు, ఇతర వస్తువులను అమ్ముకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. అయితే అతడిని మంగళవారం అరెస్టు చేసి విచారించగా, కొల్చారం మండలంలోని చిన్నఘనపూర్ ఎల్లమ్మ గుడిలో గతేడాది అక్టోబర్‌లో దుంపలకుంట తాండ సేవాలాల్ గుడిలో చోరీ, నవంబర్‌లో పాపన్నపేట మండలంలోని నార్సింగి ఎల్లమ్మ గుడి, దారి దేవుడు గుడిలో దొంగతనాలు చేసినట్లు ఒప్పుకున్నాడు. నిందితుడి వద్ద నుంచి సీసీ కెమెరా, డీవీఆర్ బాక్స్ స్వాధీనం చేసుకున్నారు. చాకచక్యంగా వ్యవహరించిన పాపన్నపేట ఎస్సై మహిపాల్ రెడ్డి, కొల్చారం ఎస్సై గౌస్, ఏఎస్సై గాలయ్య, కానిస్టేబుళ్లు దుర్గాప్రసాద్, బసవరాజ్‌లను డీఎస్పీ అభినందించారు.